క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో మంగళవారం ఛలో ఢిల్లీ పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్ ఆవిష్కరించారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష ర్యాలీ విజయవంతం చేయాలని కోరారు. కార్మిక చట్టాల సవరణ, రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర తదితర డిమాండ్‌లతో చేపడుతున్న ర్యాలీకి తరలిరావాలని సూచించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, బాబా, భిక్షపతి, బుచ్చ య్య, మురళి, రాజు, అంజి, కోటి, పాల్గొన్నారు.

పరీక్షలంటే విద్యార్థులు ఆందోళనకు గురికావొద్దు


మాట్లాడుతున్న సీఐ సురేశ్

వీణవంక: పరీక్షలంటే విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ఏకాగ్రతతో పాటు జ్ఞాపకశక్తిని అలవర్చుకొని ఒత్తిడిని అధిగమించాలని జమ్మికుంట రూరల్ సీఐ సురేశ్ అన్నారు. మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్‌లో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరీక్షలపై అవగాహన, అపోహలు, స్టడీ స్కిల్స్, పాఠ్యాంశాల ప్రాముఖ్యత, మైండ్ మ్యాపింగ్, మోటివేషన్, సమయం విలువ తదితర అంశాలపై మోటివేటర్స్ స్వామి, గాజుల అనిల్, శ్రావణితో కలిసి అవగాహన కల్పించారు. ముందస్తు ప్రణాళిక తో చదువుకోవాలని, పరీక్షల భయం వీడాలని సీఐ, ఎస్సై శేఖర్‌రెడ్డి సూచించారు. ఇష్టంతో చదువుతూ తల్లిదండ్రుల కలలు నిజం చేయాలని, చెడు అలవాట్లకు బానిసకాకుండా పరీక్షల సమయంలో ఆరోగ్య నియమాలు పాటించాలని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడొద్దు'


మాట్లాడుతున్న నాయకులు

జమ్మికుంట: విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని, టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను భర్తరఫ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాందారపు రత్నాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీతో 30 లక్షల మంది విద్యార్థులు, నిరుద్యోగుల ఆశలు అడియాశలయ్యాయని, రద్దయిన గ్రూపు–1 పరీక్షకు ప్రభుత్వమే ఉచితంగా కోచింగ్ ఇవ్వాలని, నష్టపోయిన విద్యార్థులకు రూ. 25వేలు అందించాలన్నారు. అవినీతి అక్రమాలకు నిలయమైన టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, జిల్లా కోశాధికారి అలువాల విష్ణు, వంశీ, భరత్, రవి, మనోజ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్లు అందజేత


సైకిళ్లు అందిస్తున్న సొసైటీ సభ్యులు

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సైకిళ్లు అందించారు. సొసైటీ జిల్లా కార్యదర్శి జమున, హెచ్ఎం రాధారాణి మాట్లాడుతూ... దూరభారం ఉన్న పదిమందిని సైకిళ్లు అందించామని, సంస్థ ద్వారా గడిచిన మాసంలో ఇరవై సైకిళ్లు, ఆరు కుట్టుమిషన్లు పంపిణీ చేశామన్నారు. పేద విద్యార్థినులకు చేయూతనివ్వడమే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ కార్యవర్గ సభ్యులు ప్రవీణ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ వాజిద్ అలీ, రాములు, ఏసుదాసు, మహేశ్, రాజమణి, లక్ష్మి, తిరుపతి, పల్లవి, శ్రీధర్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కోల రమేశ్ తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు దేవిప్రియ, అక్షయ, శరణ్య, అర్జున్ ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారని, డిగ్రీ వరకు ఏడాదికి రూ.12,000 స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు. స్కూల్‌లో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రాజు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టినా.. నత్తనడకన పనులు

- 'మనఊరు–మనబడి'లో 13 పాఠశాలలు ఎంపిక
- ఐదు పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి
- మిగతా స్కూళ్లలో కొనసాగుతున్న ఫైనం
- మార్చి 31లోపు పూర్తి చేయాలంటున్న అధికారులు



బేతిగల్ పాఠశాలలో పూర్తయిన పనులు

వీణవంక: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మనఊరు -మనబడి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది మే లో కార్యక్రమం ప్రారంభించగా నిధులు సక్రమంగా విడుదల కావడంలేదనే సాకుతో ఇప్పటివరకు పనులు పూర్తి స్థాయిలో జరగలేదు. పాఠశాలల్లో కనీస వసతులు మెరుగుపడుతాయని విద్యార్థులు ఆశించగా వారి ఆశలు ఆవిరయ్యే పరిస్థితి నెలకొంది. ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయాల్సిందేనని అధికారులు హెచ్చరిస్తున్నా ఆ దిశగా పనులు పూర్తి అయ్యేలా కనిపించడం లేదు.

నిధులు రావడంలేదని..

మండలంలో 48 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 13 పాఠశాలలు మన ఊరు–మన బడికి ఎంపిక కాగా మొదటి విడుతలో బేతిగల్, కొండపాక పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. రెండో విడతలో మరో మూడు పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. మొత్తం ఐదు పాఠశాలల్లో ఆశించిన ఫలితాలు కనిపిస్తుండగా మిగిలిన ఎనిమిది పాఠశాలల్లో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కొన్ని పాఠశాలలో పనులు నిలివేశారు. పనులు చేస్తున్న నిధులు సక్రమంగా రావడంలేదని గుత్తేదారులు పనులు చేయడం లేదని ఆరోపణలు వెలువడుతున్నాయి. బేతిగల్ ఉపసర్పంచ్ చొప్పరి తిరుపతి, మాసాడి మాదవరావు ప్రత్యేక చొరవ తీసుకొని పనులు పూర్తి చేశారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంగ్లిష్ మీడియం అమలు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఇప్పటికే ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టింది. ఫలితంగా గతంలో కంటే మెరుగైన ఫలితాలు కన్పిస్తున్నాయి. మనఊరు మనబడితో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. క్షేత్రస్థాయిలో కార్యక్రమం సక్రమంగా అమలు కావడం లేదని వినిపిస్తోంది. టాయిలెట్లు, నీటి సౌకర్యం, ఫర్నిచర్, విద్యుదీకరణ, మంచినీటి వసతి, గ్రీన్ చాక్‌బోర్డులు, పెయింటింగ్‌తో పాటు పలు పనులు కార్యక్రమం పరిధిలోకి రానున్నాయి. సర్వశిక్ష అభియాన్, ఉపాధి హామీ, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ, నాబార్డు నుంచి నిధులు సమీకరిస్తారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకొని త్వరగా పనులు పూర్తి చేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో విడపు శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఎంపిక చేసిన పాఠశాలల్లోని ఐదింటిలో పనులు పూర్తయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో మార్చి నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించామని తెలిపారు.

అధికారులు స్పందించాలి

మనఊరు మనబడిలో పాఠశాలల్లో చేపడుతున్న పనులు పూర్తి స్థాయిలో జరగడంలేదు. త్వరగా పూర్తి చేస్తే విద్యార్థులకు ఇబ్బందులు తప్పుతాయి. సక్రమంగా పనులు చేపట్టకపోవడంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గుత్తేదారులకు నిధులు మంజూరు కావడంలేదని అందుకే పనులు ముందుకు సాగడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వచ్చే విద్యా సంవత్సరంలోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– చింతల శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు

విద్యార్థులు చదువుల్లో రాణించాలి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: విద్యార్థులు చదువుల్లో గొప్పగా రాణించాలని గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని న్యూ మిలీనియం పాఠశాల వార్షికోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో కార్పొరేటు స్థాయి విద్యనందించడం అభినందనీయమన్నారు. తక్కువ సమయంలో పాఠశాలకు మంచిగుర్తింపు తీసుకురావడానికి స్కూల్ చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి ఎంతో కష్టపడ్డారని, పాఠశాలలో స్పోర్ట్స్ డే నిర్వహిస్తే పాల్గొంటానన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశినికోటి, కౌన్సిలర్లు శ్రీపతి నరేష్, దిలీప్, ప్రిన్సిపల్ విశ్వనాథరెడ్డి, వరుణ్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ఇప్పల నర్సింగాపూర్, కాట్రపల్లి, దమ్మక్కపేట గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను కౌశిక్‌రెడ్డి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. కాట్రపల్లి మాజీ సర్పంచ్ తొగరు భిక్షపతి తండ్రి మల్లయ్య ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వెంట ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ఉన్నారు.

దృష్టి లోపాలు తొలగించుకోవాలి

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్
- కంటి వెలుగు, ఆరోగ్య మహిళా శిబిరాల పరిశీలన


మహిళలకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

చొప్పదండి: స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, దృష్టి లోపాలను తొలగించుకోవాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ కోరారు. చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా, నవ భారతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎవరు దృష్టిలోపంతో బాధపడకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తోందని, ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండాలనే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఆరోగ్య మహిళా కేంద్రాల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది అంతా మహిళలే ఉంటారని, మొహమాటపడకుండా నిర్భయంగా వివిధ సమస్యలకు వైద్య సేవలు పొందాలన్నారు. సమస్య తీవ్రతను బట్టి అవసరమైతే జిల్లా ప్రధాన ఆసుపత్రికి పంపిస్తామన్నారు. వెంట జిల్లా పరిషత్ సీఈవో ప్రియాంక, తహసీల్దార్ అంబటి రజిత, ఎన్వైకే కోఆర్డినేటర్ వెంకట రాంబాబు, ఎంపీడీవో స్వరూపారాణి, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలుపై సమీక్ష


సమీక్షలో మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

చొప్పదండి: మున్సిపల్ పరిధిలోని నివాస, వాణిజ్య గృహాలు, రైస్‌మిల్లులు, స్కూల్, కాలేజీల ఆస్తిపన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆస్తిపన్ను వసూలుపై సిబ్బంది, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్తి పన్ను చెల్లింపునకు పది రోజులే సమయం ఉందని, యజమానులు త్వరపడాలని సూచించారు. గడువులోగా చెల్లించనివారికి రెండు శాతం వడ్డీ పడుతుందని, మున్సిపల్, తెలంగాణ రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఆస్తులు జప్తు చేస్తామన్నారు. మున్సిపల్ సిబ్బందికి సహకరించి వెంటనే పన్నులు చెల్లించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ పి. రవీందర్, అంజయ్య పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

తిమ్మాపూర్: జ్యోతిష్మతి ఫార్మసీ కళాశాలలోని 13 మంది విద్యార్థులు ప్రతిమ హాస్పిటల్ నిర్వహించిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మనోహర్ సిట్టిబాబు తెలిపారు. మంగళవారం విద్యార్థులను కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అభినందించారు. డాకర్లు పరమేశ్వర్, కుమార్, హాస్పిటల్ హెచ్ఆర్ మేనేజర్ భాస్కర్, చీఫ్ ఫార్మసిస్ట్ లక్ష్మణ్ విద్యార్థులను అభినందించారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట: ఒంటరితనం భరించలేక యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కోరపల్లికి చెందిన గుండారపు సదానందచారి, తిరుపతమ్మ దంపతులకు ముగ్గురు కొడుకులు. పెద్ద, చిన్న కొడుకులకు వివాహమైంది. రెండో కొడుకు విష్ణువర్ధన్(31)కు వివాహం కావడం లేదని తాగుడుకు అలవాటుపడ్డాడు. తల్లిదండ్రులు కార్పెంటర్ పని చేసుకుంటూ హనుమకొండలో జీవిస్తున్నారు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, ఇంటి పక్కనే ఉన్న పెద్దనాన్న కొడుకు మంగళవారం ఉదయం గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించాడని, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ రామచందర్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి..

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన బీరకాయల అపర్ణ (19)ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. సీఐ బి. రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు.. కరీంనగర్‌లో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న అపర్ణ ఈ నెల 20న కడుపు నొప్పి భరించలేక గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

108లో ప్రసవం

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌కు చెందిన జమునకు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువకావడంతో అంబులెన్స్‌లోనే బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను కరీంనగర్‌లోని మాతా శిశు కేంద్రానికి తరలించారు. చాకచక్యంగా వ్యవహరించిన ఈఎంటీ కుమార్, పైలట్ సుధాకర్‌కు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నాయకుల పరామర్శ


పరామర్శిస్తున్న వినోద్‌కుమార్, కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దె గ్రామానికి చెందిన జర్నలిస్ట్, ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు అల్లి నరేందర్ తల్లి లచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులను మంగళవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. వెంట ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్ ప్రతాప తిరుమల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజినల్ డైరెక్టర్ సిద్ధార్థకుమార్ అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ డా. కందుకూరి శంకర్ అధ్యక్షతన పబ్లిక్ ఇంటరాక్షన్ కార్యక్రమం జరిగింది. నీటిని ఆదా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి నీటిని ఆదా చేయాలన్నారు. శాస్త్రవేత్తలు డా.మల్లికాదేవి, రాణి, డా.సుధీర్‌కుమార్.డా.ఒబులేషు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు


మొక్క నాటుతున్న సీపీ సుబ్బారాయుడు

హుజూరాబాద్‌రూరల్: ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కారం దిశగా సేవలందించాలని కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. శాంతిభద్రతల పరిరక్షణ నిరంతరం నిఘా ఉంచాలని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో మూఢనమ్మకాల నిర్మూలన, పోలీస్ సేవల గురించి ప్రజలకు తెలియజేసేందుకు కళాజాత ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. అనంతరం కార్యాలయంలోని రికార్డ్స్, లాకప్, మెన్ బ్యారక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బంది విధులకు సంబంధించిన సూచనలు ఇచ్చారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐలు బొల్లం రమేష్, జనార్దన్, ఎస్ఐ ఉన్నారు.

పల్లె ప్రగతి, పారిశుధ్యంపై ముగిసిన శిక్షణ

తిమ్మాపూర్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పల్లె ప్రగతి, పారిశుధ్యంపై మూడు రోజులుగా నిర్వహించిన అవగాహన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా ఎంపీపీ కేతిరెడ్డి వనితరెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత హాజరై మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే చేసి పారిశుధ్య ప్రణాళిక తయారు చేసుకోవాలని తెలిపారు. మహిళలు సంఘం సమావేశాల్లో పారిశుధ్యంపై చర్చించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. శిక్షణలో పాల్గొన్న సర్ప ంచులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్‌రెడ్డి ఎంపీవో కిరణ్ కుమార్, వైస్ ఎంపీపీ వీరారెడ్డి, ఏపీఎం, ఏపీవో, స్వచ్ఛభారత్ మిషన్ టీం సభ్యులు టి. రమేష్, కే. వేణు ప్ర సాద్, శ్రీధర్, సర్పంచులు, ఎంపీటీసీలు, జీపీ కార్యదర్శులు, వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జన చైతన్యయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జన చైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. పార్టీ జోన్ కమిటీ సభ్యుడు చెల్పూరి రాములు మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని దానికి నిరసనగా 23న ఆదిలాబాద్‌లో యాత్ర చేపడుతున్నామని, 26న కరీంనగర్‌కు యాత్ర చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కమిటీ సభ్యుడు శ్రీకాంత్, మల్లయ్య, రాజు, ఎల్లయ్య, వెంకన్న, సమ్మయ్య, సారయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నియంత్రించాలి

తిమ్మాపూర్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, నియంత్రణకు అందరూ సహకారించాలని మండల స్థాయి బాల్య వివాహాల నిరోధక టీం కన్వీనర్, తిమ్మాపూర్ తహసీల్దార్ కనకయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పోషణ్ పక్షం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో ప్రచారం, సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధక మండల స్థాయి సమావేశం ప్రతినెల నిర్వహించాలన్నారు. పోషణ్ పక్షం కార్యక్రమాల కార్యాచరణ మండల స్థాయి అధికారులకు వివరించి పోషణ్ పక్షం పోస్టర్ ఆవిష్కరించారు. ఏసీడీపీవో అరవింద, డీసీపీ శాంత, ఎస్‌బీఎం జిల్లా శిక్షణ అధికారి సురేందర్ రెడ్డి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కంటి వెలుగు ప్రారంభం

గంగాధర: మండలంలోని వెంకటాయిపల్లి గ్రామంలో మంగళవారం సర్పంచ్ సిరిమల్ల మేఘరాజు కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయడంతో పాటు అవసరం ఉన్నవారికి ఆపరేషన్లు చేస్తారని పేర్కొన్నారు.

చిన్నకోమిటిపల్లి గ్రామంలో..

ఇల్లందకుంట: మండలంలోని చిన్నకోమిటిపల్లి లో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ చిట్ల సరోజనవాగన్న ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి తులసిదాస్, క్యాంపు ఇన్‌చార్జి డాక్టర్ సరిత, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ మోటపోతుల ఐలయ్యగౌడ్, పీహెచ్ఎన్ శ్యామల, కార్యదర్శి కిషోర్, రాజు, రవికిరణ్, సుమలత, స్వరూప, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

రామడుగు: అకాల వర్షాలతో నష్టపోయిన అన్నదాతలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య అన్నారు. మంగళవారం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

రూ.30వేల పరిహారం ఇవ్వాలి

శంకరపట్నం: పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఊకంటి మదుకర్ కోరారు. మండలంలోని కేశవపట్నంలో మంగళవారం మాట్లాడారు. వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పంటలు చేతికందే సమయంలో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తహసీల్దార్‌కు వినతి

రామడుగు: మండలంలో నష్టపోయిన పంటలపై సర్వే చేసి పరిహారం అందజేయాలని టీటీడీపీ నాయకులు మంగళవారం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సీఎం పర్యటన అడ్డుకుంటాం

గంగాధర: నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటామని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ హెచ్చరించారు. మండలంలోని వెంకటాయిపల్లి గ్రామంలో మంగళవారం పాడైన పంటలను పరిశీలించారు.

కార్మికుల సంక్షేమం కోసం పోరాటం

చొప్పదండి: వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం పోరాటాలు చేసేందుకు రూపకల్పన చేస్తున్నామని వ్యవసాయ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యాడ సృజన్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాల పోస్టర్‌ను నాయకులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి రెండు రోజుల పాటు కరీంనగర్‌లోని తారక్ హోటల్‌లో సమావేశాలు నిర్వహిస్తామని, వ్యవసాయ కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంజయ్య, రమేశ్, రంగు రమేశ్ గౌడ్, నారాయణ, రవీందర్, కనుకయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సన్మానం

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరం దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా మెడికల్ అధికారులు, సిబ్బంది, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావును సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. సహకరించిన మహిళా సంఘాలకు అంగన్‌వాడీ టీచర్లను సత్కరించారు.

ఉగాది వేడుకలు



గంగాధర: మండలంలోని ఒద్యారం, బూర్గుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. టీచర్లు పండుగ విశిష్టత విద్యార్థులకు వివరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్: రాజశేఖర్ - 9618304759
చొప్పదండి: ముందయ్య - 7997958217
మానకొండూర్: మహేశ్ - 9573106760
హుజూరాబాద్: ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899